క్లుప్తంగా

శిల్పారామంలో సందడి



యువకుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక కిశోర్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాలను శిల్పారామాల పాలనాధికారి మునిరాజు పర్యవేక్షించారు.

విద్యుత్ లైన్లను కప్పేసిన చెట్ల కొమ్మలు



రామాంజనేయపురం పరిధిలో విద్యుత్ లైన్‌ను కప్పేసిన చెట్ల కొమ్మలు

కడప కార్పొరేషన్ : కడప నగరం రామాంజనేయపురం పరిధిలో ఉన్న జర్నలిస్టుకాలనీ, వరదకాలనీ, ఆచారి కాలనీ ప్రాంతాల్లో చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. ఈ చెట్ల కొమ్మలు విద్యుత్‌లైన్లను కప్పేయడం వల్ల వర్షాలు వచ్చినప్పుడు లైన్లు రాసుకొని వాటి నుంచి నిప్పురవ్వలు ఎగసిపడుతున్నాయి. కొన్నిసార్లు లైన్లు తెగిపోతున్నాయి. ఈ చెట్ల కొమ్మలను తొలగించాలని విద్యుత్ సిబ్బందికి స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. మీరే చెట్ల కొమ్మలను తొలగించుకోవాలని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఇప్పటికైనా విద్యుత్ లైన్లకు అడ్డు రాకుండా చెట్ల కొమ్మలను తొలగించాలని వారు కోరుతున్నారు.

యూనివర్సిటీలో ఆడిటోరియం నిర్మించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన యూనివర్సిటీలో ఆడిటోరియంను వెంటనే నిర్మించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొడూరు మల్లికార్జున డిమాండ చేశారు. ఆదివారం యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని గురుకులంలో విద్యార్థులు వెళ్లేందుకు రోడ్డు లేకుండా ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే యూనివర్సిటీ అధికారులు కొత్త రోడ్డు నిర్మించాలని కోరుతున్నామన్నారు. అలాగే హాస్టల్‌లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షులు హనీష్, ఉపాధ్యక్షులు జావీద్ వలి, అరుణ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

వేడినీళ్లు పడి బాలుడికి గాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని ఎన్జీఓ కాలనీకి చెందిన యశ్వంత్ (9) ఆదివారం స్నానం చేస్తుండగా.. నీళ్లు ఎక్కువగా వేడిగా ఉండటంతో గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే బాలుడిని రిమ్స్‌లో చేర్పించగా, వైద్యులు చికిత్స చేస్తున్నారు.

ధరల దరువు.. సామాన్యులకు బరువు

- మళ్లీ కొండెక్కిన కూరగాయలు
- కిలో రూ.60కి చేరిన టమాట
- రూ.80కి పెరిగిన బీన్స్
- ఘాటు తగ్గని ఎర్రగడ్డలు



రైతు బజార్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కడప అగ్రికల్చర్ : పేదలు, సామాన్యులకు మళ్లీ పచ్చడి మెతుకులు తినే రాత తప్పడం లేదు. మొన్నటి వరకు కాసింత తగ్గిన కూరగాయల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చోట్లు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మళ్లీ ధరలు క్రమేపీ పెరుగుతూ కొండెక్కుతున్నాయి. రూ.500 తీసుకుని రైతు బజార్‌కు పోతే సంచిలోకి సగం కూడా కూరగాయలు రావడం లేదని జనాలు వాపోతున్నారు.

మొన్నటి వరకు 30 రుపాయలున్న...

మొన్నటి వరకు కిలో 30 రూపాయలు ఉన్న టమాట ఉన్నఫలంగా డబుల్ రేటు పెరిగి రూ.60 చేరింది. అంత డబ్బు పెట్టినా టమాటలైనా నాణ్యంగా ఉన్నాయంటే అదీ లేదు. ఏ కాయ ముట్టినా మెత్తగా పుసపుస అంటూ నీరు కారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. బీన్స్ కూడా కిలో రూ.80కి చేరింది. కాప్సికమ్ కిలో రూ.55 ఉంది. క్యారెట్, చిక్కుడకాయ, ఆలసందలు కిలో 50లకు చేరాయి. అనపకాయ కిలో రూ.45 ఉండగా, బంగాళదుంప కిలో రూ.44 పలుకుతోంది. బీరకాయ, దొండకాయలు, ముల్లంగి కూడా కిలో రూ.40 ఉన్నాయి. కాలీఫ్లవర్ రూ.35, బీట్రూట్ 30 ఉండగా వంకాయి, బెండకాయ, మట్టిక్కాయలు మాత్రం కిలో రూ.20 ఉన్నాయి. మిరపకాయలు మాత్రం కిలో రూ.16లకు దొరుకుతుంది. ఉల్లిగడ్డల ఘాటు మాత్రం అలాగే ఉంది. కొత్త గడ్డలు కిలో రూ.35 ఉండగా, పాత గడ్డలు రూ.50కు అమ్మకాలు చేస్తున్నారు.

మార్కెటింగ్ శాఖ తరపున..

దసరా పండుగను పురస్కరించుకుని టమాట ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెటింగ్ శాఖ కల్పించుకుని నో లాస్... నో గెయిన్ కింద రైతులు వద్ద టమాటలు కొనుగోలు చేసి ఖర్చులు కలుపుకొని వినియోగదారులకు అందించాలని శ్రీకారం చుట్టింది. అయితే రెండు రోజుల క్రింతం కడప మార్కెటింగ్ శాఖ అధికారులు పులివెందుల, వేంపల్లి ప్రాంతాలకు వెళ్లి టమాటలు పరిశీలించి కిలో 45 రూపాయల లోపే కొనుగోలు చేసి కడప రైతు బజార్‌కు రవాణా, దింపుడు ఖర్చులు కలుపుకొని కిలో రూ.45తో నో లాస్.. నో గెయిన్ కింద అమ్మకాలను ప్రారంభించారు. అయితే టమాటల సరఫరాకు సంబంధించిన ఓ వ్యాపారి రైతు బజార్‌కు పంపించిన వాటిలో కొన్ని మంచివి.. మరికొన్ని పుచ్చులు, దెబ్బతిన్న కాయలను వేసినట్లు తెలిసింది. దీంతో ఆదివారం మార్కెటింగ్‌శాఖ అధికారులు కొద్ది సేపు తమ సిబ్బందిని పెట్టి.. కొన్ని బాక్సుల టమాటాలను కిలో రూ.45కు అమ్మారు. ఆ తరువాత కాయలు సరిగా లేకపోవడంతో వినియోగదారులు తీసుకోకపోవడంతో వారు అమ్మలేక చేతులెత్తేశారు. అమ్ముడు పోని కాయలను రైతు బజార్‌లోని సిబ్బంది.. రైతు బజార్ వ్యాపారులకు ఒక్కొక్క దుకాణానికి బలవంతంగా రెండు, మూడు కిరిటీలు అంటగట్టినట్లు తెలిసింది. వాటిని వారు కిలో రూ.60కు అమ్ముకోవచ్చని మార్కెటింగ్ శాఖ చెప్పినట్లు సమాచారం. అయితే వాటి కొనుగోలుకు వినియోగదారులు ముందుకు రాకపోవడంతో ఆ కాయలను వ్యాపారులు అమ్ముకోలేక పక్కన పడేశారు. అయినా వారికి అప్పగించిన టమాటల డబ్బులను మాత్రం వారి నుంచి రైతు బజార్ సిబ్బంది వసూలు చేసినట్లు పలువురు వ్యాపారులు తెలిపారు. ఎందుకంటే మార్కెటింగ్ శాఖ వారు బయట నుంచి టమాట తెచ్చిన రైతులకు డబ్బులు చెల్లించాలి కాబట్టి వారి చేతి నుంచి పడుతుందని గమనించి.. తమకు బలవంతంగా అంటగట్టినట్లు పలువురు రైతు బజార్ వ్యాపారులు తెలిపారు. ఈ విషయంపై ఎస్టేట్ ఆఫీసర్‌తో మాట్లాడగా మార్కెటింగ్ శాఖ తరపున తెచ్చిన టమాటలను తాము కిలో రూ.45 రూపాయలకే అమ్మామని తెలిపారు. కానీ బయట వ్యాపారుల నుంచి వచ్చిన టమాటాలను మాత్రమే తాము వ్యాపారులకు వేశామని తెలిపారు. ఏదిఏమైనా ఆదివారం మార్కెట్‌కు వచ్చిన టమాటాలు మాత్రం సరిగా లేకపోవడంతో చాలా మంది కొనుగోలుకు ఆసక్తి చూపలేదు.

నీరు కారుతున్నాయి



రైతు బజార్‌లో టమాటలు కొందామని వెళ్లాను. అక్కడికి పోయి చూస్తేనేమో అన్నీ పుచ్చులు, దీంతోపాటు పండ్లన్ని దెబ్బతిని నీరు కారుతున్నాయి. పైగా ధర కూడా కిలో రూ.60 ఉండటంతో కొనుక్కోలేక వెనక్కి వచ్చాను. మిగతా కూరగాయల ధరలు కూడా రేట్లు అధికంగా ఉండటంతో అరకొరగా తీసుకుని వెళ్తున్నాను.

– వెంకటసుబ్బయ్య, హనుమాన్‌నగర్, కడప

ధరలు ఆకాశాన్నంటుతున్నాయ్...



ఒక్క టమాటాలే కాదు. మిగతా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రైతు బజార్‌లో ఒక్క మిరపకాయలు తప్ప మిగతా కూరగాయల ధరలు అధికంగానే ఉన్నాయి. టమాటలు కిలో రూ.60 ఉంటే, బీన్స్ రూ.80, క్యారెట్ రూ.50 ఇలా అన్ని ధరలు అధికంగానే ఉన్నాయి.

– సురేంద్ర, భాగ్యనగర్ కాలనీ, కడప

వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి



ఇటీవల కురిసిన వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయల ధరలు పెరిగాయి. ఈ వర్షాలకు టమాట పంటకు పురుగు పట్టి కాయలు దెబ్బతిన్నాయి. దీంతో టమాటాలు ధరలు పెరిగాయి. ఈ పరిస్థితి ఇంకా కొన్నాళ్లు ఉంటుంది.

– ఆజాద్, మార్కెటింగ్ శాఖ ఏడీ, కడప

రైతు బజార్‌కు వస్తే ముక్కు మూసుకోవాల్సిందే..!



రైతు బజార్ ఎదురుగా ఏర్పాటైన చెత్తకుప్ప

కడప అగ్రికల్చర్ : కడప రైతు బజార్‌కు కూరగాయల కోసం వెళ్తున్నారా.. అయితే ముక్కు మూసుకోవాల్సిందే. ఎందుకుంటే రైతు బజార్ ప్రధాన గేటుకు ఎదురుగా చెత్తచెదారమంతా వేసి చెత్తకుప్పను తయారు చేశారు. దీంతో కూరగాయలకు వచ్చే వినియోగదారులు అక్కడికి రాగానే దుర్గంధంలో ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ చెత్తకుప్ప తయారవడంతో రైతు బజార్‌లో కుళ్లిన కూరగాయలన్నింటినీ వ్యాపారులు అక్కడే తెచ్చి వేస్తున్నారు. ఈ కూరగాయలు తినేందుకు ఆవులు వచ్చి వాటిని తొక్కడంతో విపరీతమైన వాసన వెదజల్లుతుందని స్థానికంగా పూలు, పండ్లు, ఆకులు అమ్ముకునే చిరు వ్యాపారులు తెలిపారు. దీంతోపాటు రైతు బజార్‌కు కూరగాయల కోసం వచ్చే వారు కూడా అక్కడికి రాగానే విపరీతమైన దుర్గంధంతో ముక్కు మూసుకుని వెళ్లుతున్నారు. అక్కడ వేసిన చెత్తాచెదారం కుళ్లి భరించరాని కంపుగోడుతుంది. స్థానికంగా ఉండే వ్యాపారులు, కూరగాయలకు వచ్చే వినియోగదారలు అక్కడ వేసిన చెత్తను తీసేసి శుభ్రం చేసి, ఇక్కడ చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

‘వేమన తత్వాన్ని ఒడిసి పట్టిన శివారెడ్డి’



వేమన పద్యాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, ప్రముఖులు

కడప కల్చరల్ : వేమన తత్వాన్ని పరిశీలించి, పరిశోధించి.. ఆయనను శూన్యవాదిగా చెప్పిన మొట్టమొదటి వ్యక్తి ఆచార్య శివారెడ్డి అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం కడపలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో యోగివేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఆచార్య జి.శివారెడ్డి రచించిన వేమన పద్యాలు అనే పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వేమన పద్యాల్లో ఉన్న ఎరుక, బయలు అనే పదాల గురించి బాగా విశ్లేషించి.. వేమన ఏ మతానికి చెందిన వాడు కాదని, అతని తత్వం నాగార్జునని, శూన్యవాదానికి దగ్గరగా ఉందని, నూతన కోణంలో చెప్పడం విశేషమన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ శివారెడ్డి తన రచనలో కుల వ్యవస్థను వేమన పూర్తిగా వ్యతిరేకించారని, జన్మతా అందరూ శూద్రులేనని, సంస్కారం ద్వారా మాత్రమే బ్రాహ్మణులుగా మారుతారని చెప్పడం ఆయన పరిశీలనా దృష్టికి నిదర్శనమన్నారు. అనంతరం సంస్థ సభ్యులు ఆచార్య శివారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి భూమిరెడ్డి స్వరూపారాణి, సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కవి మామిళ్ళ లోకనాథం, హిందూ ధర్మం సమాజ ప్రార్థనా దేవాలయ సంస్థ వైస్ చైర్మన్ కాల్వ సోము కళానాథరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించలేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడప ఎపిటిఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12వ పిఆర్సీ అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందని, వెంటనే ముఖ్యమంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. వీలైనంత తొందరగా మెరుగైన ఫిట్మెంట్‌తో 12వ పిఆర్సీని ప్రకటించాలన్నారు. పెన్షనర్లకు, సిపియస్ ఉద్యోగులకు కరువుభత్యం బకాయిలను నగదు రూపంలో చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమంను కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించకూడదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో చర్చించాలన్నారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రమేష్ రెడ్డి జిల్లా కార్యదర్శులు రామచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు మస్తాన్‌బాబు, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ అమరావతి ఆర్గనైజింగ్ కార్యదర్శి సీవీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్‌సీ అమలు పరచాల్సిన గడువు ముగిసినందున వెంటనే పీఆర్‌సీ కమిటీ వేసి ఆలస్య కాలానికి ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్సి అమలు పరచాల్సిన గడువు 14 నెలలు దాటినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. తక్షణం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించేలా 10వ తేదీ నాటి క్యాబినెట్లో నిర్ణయించాలన్నారు. కమిటీ అన్ని జిల్లాలలో పర్యటించి ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలను సేకరించాలని కోరారు. ఆరు నెలల్లో నివేదిక సమర్పణ గడువు ఉండాలన్నారు. ఏపీటీఎఫ్ అమరావతి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి ఈశ్వరచంద్ర, ఉమాకాంత్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు స్టెప్ అప్ సౌకర్యం తాజా పిఆర్సిలో పునరుద్ధరించాలని కోరారు. స్పెషల్ టీచర్లకు తాత్కాలిక సర్వీస్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు సర్వీసులోనే పొందేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ అమరావతి జిల్లా నాయకులు రాజగోపాల్, పద్మజతోపాటు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

‘వంక భూమి ఆక్రమణ’

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని చిన్నచౌకు గ్రామ పొలం సర్వే నంబర్ 384లో వంక పొరంబోకు స్థలాన్ని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ భూ సంరక్షణ సంఘం అధ్యక్షులు శ్రీరాములు కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిలక్ నగర్‌లో దళితుల శ్మశానంలో 15 సెంట్లు ఆక్రమించి ఓ వ్యక్తి షాపు రూములు నిర్మించాడని, హైవేను ఆనుకొని విలాసవంతమైన భవనం నిర్మించుకున్నారన్నారు. అలాగే సీకే దిన్నె మండల పరిధిలో మామిళ్లపల్లె హైవే రింగురోడ్డు వద్ద సర్వే నంబర్ 729/1, 2లో వంక పొరంబోకు స్థలంలో 25 సెంట్లు ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాడన్నారు. మామిళ్లపల్లె రింగు రోడ్డులో 729/3లో 10 సెంట్లు, 729/4లో 16 సెంట్లు ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి బాడుగలకు ఇచ్చారన్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లకు ఎలాంటి ప్లాన్ కూడా లేదన్నారు. కోట్లాది రూపాయల విలువ గల స్థలాలు ఆక్రమణకు గురైనా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఈ ఆక్రమణలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి వంకలు, వాగులను పరిరక్షిస్తామని తెలిపారు.

బ్రౌన్ కేంద్రం సందర్శన



బ్రౌన్ గ్రంథాలయంలో పుస్తకాన్ని చూపుతున్న డాక్టర్ దాసరి శ్రీనివాసులు

కడప కల్చరల్ : కడపలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సందర్శన మనసుకు సంతృప్తినిస్తుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి తెలుగు ప్రజలకు ఒక గొప్ప విజ్ఞాన సౌధాన్ని అందించి బ్రౌన్‌కు శాశ్వత కీర్తిని అందించారన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అధికారులు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. అరుదైన పుస్తకాల్ని నిక్షిప్తం చేసిన విజ్ఞానవంతుల్ని, గ్రంథాలయ సంచాలకులు, సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

పాఠశాలల నిర్వహణకు గ్రాంటు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్ : పాఠశాలల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రాంటును విడుదల చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, అధికార ప్రతినిధి ముత్తోజి వీరబ్రహ్మం డిమాండ్ చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్కపైసా కూడా గ్రాంటును ఇవ్వలేదన్నారు. అలాగే 2024–25 ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ గ్రాంటు విడుదల కాలేదన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ప్రధానోపాధ్యాయులే సొంత నిధులను ఖర్చు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఈ గ్రాంటు మంజూరు చేసేదని, దాంతో చాక్‌పీస్‌లు, పొరకలు, కరెంటు బిల్లులు, చిన్నచిన్న రిపేర్లు మొదలకు పనులను నిర్వహించుకునే వారన్నారు.


ఆస్పత్రి ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం గుంత బజార్ మెయిన్‌రోడ్‌లో ఆదివారం నూతన జనతా మెడికేర్ హాస్పిటల్ ప్రారంభోత్సవం జరిగింది. ప్రముఖ సంఘ సేవకులు జనతా గ్రూప్స్ ఫౌండర్ షేక్ నూరుద్దీన్ చేతుల మీదుగా ప్రారంభించారు. హాస్పిటల్ అధినేత ప్రముఖ జనరల్, ఫిజీషియన్, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ షేక్ జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ నగర నడిబొడ్డులో అన్ని వసతులు, అత్యాధునిక పరికరాలతో హాస్పిటల్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈనెల 31వ తేదీ వరకు డాక్టర్ ఫీజు లేకుండా రోగులకు ఉచితంగా చూస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని ప్రముఖ డాక్టర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జననీ.. శివకామిని.. జయశుభ కారిణి



గజలక్ష్మిదేవిగా శ్రీ వాసవాంబ



శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో రాధాకృష్ణుల అలంకారం

కడప కల్చరల్ : సాయంత్రం ఆరు గంటలైంది.. నగరంలోని అమ్మవారి ఆలయాల సమీపంలోని రహదారులు క్రమంగా భక్తులతో నిండిపోయాయి. రాత్రి 7 గంటలకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాలకు చేరుకున్నారు. ధగధగలాడుతున్న విద్యుత్ దీప కాంతుల్లో సువర్ణ ఆభరణాలతో మెరిసిపోతున్న అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని తిలకించి మైమరిచిపోయారు. తమ పిల్లాపాపలను చల్లాగా చూడాలని, కష్టాలను తీర్చేందుకు నీవు తప్ప మరొకరు లేరని అమ్మవారిని మనసారా మొక్కుకున్నారు. కడప నగరంలో ఆదివారం అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. దేవునికడపలో ఉభయ దేవేరులతో సహా కడప రాయుడిని హనుమద్ వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో కొలువుదీర్చారు. స్థానిక విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కుష్మాండ అలంకారంలో కొలువుదీర్చారు. అమ్మవారికి ఇరువైపులా ఆమెను మరో రెండు రూపాలలో అలంకరించి వేదికపై ఏర్పాటు చేశారు. ఈ మూర్తులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. అమ్మవారిశాలలో శ్రీ కన్యకా పరమేశ్వరీని గజలక్ష్మిగా అలంకరించారు. అమ్మవారి వద్ద ఏర్పాటు చేసిన కరెన్సీ కట్టలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక గడ్డిబజారు శివాలయంలో అమ్మవారిని శ్రీ లక్ష్మిదేవిగా అలంకరించారు. శ్రీ సత్యదేవుని ఆలయంలో స్వామిని శ్రీ రాధాకృష్ణులుగా అలంకరించారు. బాల పోలేరమ్మను అదే అలంకారంలో కనుల పండువగా తీర్చిదిద్దారు. శంకరాపురం ఎస్‌బీఐ కాలనీలో అమ్మవారి మట్టి విగ్రహానికి శ్రీ లలితాదేవిగా అలంకారం చేశారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని 45వ డివిజన్ పరిధి ఊటుకూరు గ్రామం శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలోని పార్వతిదేవి అన్నపూర్ణదేవిగా, మహాలక్ష్మీదేవి కన్యకా పరమేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు.



నదీవీధి గంగమ్మ ఆలయంలో గంగమ్మ తల్లిగా అమ్మవారు




బాల పోలేరమ్మ ఆలయంలో..



అన్నపూర్ణదేవి అలంకారంలో పార్వతి దేవి



హనుమద్ వాహనంపై కడప రాయుడు



శ్రీలక్ష్మీదేవిగా కామకోటి కళాంబదేవి

వైభవంగా శరన్నవరాత్రులు



కడప నగర పరిధి బిల్టప్ సమీపంలోని ఆచార్ల కాలనీలో ఉన్న హోమియోపతి కళాశాల ఎదురుగా వెలసిన శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు గురువారం దుర్గాదేవిగా, శుక్రవారం బాలత్రిపురసుందరిదేవిగా, శనివారం గాయత్రీదేవిగా, ఆదివారం అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. సోమవారం లలితాదేవిగా, మంగళవారం మహాలక్ష్మీదేవిగా, బుధవారం సరస్వతిదేవిగా, గురువారం చండీదేవిగా, శుక్రవారం మహిషాశురమర్దినిగా, శనివారం రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిస్తారు.